హైదరాబాద్ వార్త



# బీకేర్ ఫుల్ !

- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- అప్రమత్తం లేకపోతే సొమ్ము గోవిందా
- బ్యాంక్ వివరాలు ఎవరికీ చెప్పొద్దు
- అత్యాశకు పోతే ఉన్న నగదు మాయం..



**హైదరాబాద్, డిసెంబరు 1,ప్రభాతవార్త:** సార్ మేము బ్యాంకు నుండి మాట్లాడుతున్నాం మీ డెబిట్ కార్డు కాల పరిమితి ముగిసింది. కార్డు నెంబర్,పిన్‌నెంబర్ మాకు చెప్తే దానిని పొడిగిస్తాం. అంటూ వాటిని సేకరించి నిమిషాల వ్యవధిలో కార్డు నుండి వేలాది రూపాయలను స్వాహా చేస్తున్నారు. మరికొందరు మీపాన్ నెంబర్‌ను అప్‌డేట్ చేస్తాం. ఆర్‌బిఐ ఉత్తర్వులు మేరకు తప్పకుండా చేయించుకోవాలి మీకార్డు వివరాలు ఇవ్వండని కొందరు, విదేశాల్లో మీపిల్లలు విద్యాభ్యాసం చేస్తున్నారు కదా.మాట్రస్ట్ తరపున అలాంటి వారికి సహాయం చేస్తున్నాం, మీబ్యాంక్ ఖాతా వివరాలు ఇవ్వండి అంటూ ఖాతా నుండి డబ్బులు డ్రా చేస్తున్నారు. అంతే కాకుండా మీఖాతాలో ఎక్కువ డబ్బు ఉంది కదా.అలాంటి ఖాతాలను బ్లాక్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందంటూ మరికొందరు. మీకు విదేశీ లాటరీ తగిలింది లక్షల్లో డబ్బులు వస్తాయి. మినిమం లక్షరూపాయలు వేయండంటూ ఇంకొందరు ఇలా సామాన్యులను ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో మోసగిస్తునే ఉన్నారు. కొందరు అత్యాశకు పోయి డబ్బును చేతులారా చేజార్చుకుంటుండగా మరికొందరు అవగాహన లేక సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోతున్నారు. ఇటీవల కాలంలో నగరంలో సాక్షాత్తూ ఒక ఎమ్మెల్సీ తన ఏటీఎం కార్డు వివరాలను గుర్తు తెలియని వ్యక్తులకు అందజేయగా ఖాతా నుండి వేల రూపాయలు చోరీ చేశారు. ఈవిషయమై సదరు ఎమ్మెల్సీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రతిరోజు రకరకాల నేరస్తులను చూసే ఓఎస్ఐ స్వయంగా బ్యాంకు ఖాతా వివరాలు గుర్తు తెలియని కొందరు ఫోన్‌చేస్తే అందించగా ఖాతా నుండి 50వేల వరకూ ఖాళీ అయ్యాయి. బడా బాబులు కొందరు బ్యాంకులను మోసగిస్తున్నా కొందరు సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగిస్తూ బ్యాంక్ ఖాతాలు,ఏటీఎం కార్డుల నుండి సొమ్ము కాజేస్తున్నారు.

**ఈమెయిల్స్ ద్వారా..**

వ్యాపారస్తులు, మహిళలలను లక్ష్యంగా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్లు కోటి రెండుకోట్ల రూపాయల వార్షిక టర్నోవర్ ఉన్న కంపెనీల వివరాలు సేకరిస్తున్నారు. కంపెనీ తయారు చేసే ఉత్పత్తుల గురించి తెలుసుకొని తమకు పెద్దఎత్తున సరుకు కావాలంటూ ఈమెయిల్స్ పంపిస్తున్నారు. విదేశాల వినియోగదారులుగా పరిచయం చేసుకుంటున్నారు. ఆర్డర్ కావాలంటే కాషన్ డిపాజిట్ నిబందనలు పెట్టి లక్షలు కొల్లగొడుతున్నారు. ఈఏడాది మూడు కమీషనరేట్ల పరిధిలో పది కంపెనీల నుండి సుమారు ఇరవై లక్షల రూపాయలు వసూలు చేశారు.

**ఈజాగ్రత్తలు అవసరం..**

మీ ఈ మెయిల్‌కు వచ్చే లింకుల ద్వారా బ్యాంకు వెబ్‌సైట్‌లలోకి వెళ్ళొద్దు. మొబైల్ ఫోన్,కంప్యూటర్ ఆర్థిక లావాదేవీలు హ్యాక్‌కాకుండా యాంటీవైరస్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి. పబ్లిక్ వైఫై ఉపయోగిస్తూ ఆర్థిక లావాదేవీలు చేయకపోవడం మంచిది. వెబ్‌సైట్‌లు హెచ్‌టీటీపీఎస్‌తో మొదలవుతున్నాయా లేదా గమనించాలి. అనుమానం వస్తే వెంటనే బ్యాంకుకు ఫోన్‌చేసి వాకబ్ చేయాలి. ఏదైనా మెయిల్‌ను పొరపాటున క్లిక్ చేస్తే వెంటనే ఆవిషయాన్ని బా ్యంక్ అధికారులకు చెప్పి ఖాతాకు సంబంధించిన లావాదేవీలు స్థంబింపచేయాలి.

# జిహెచ్ఎంసి పరిధిలో 300 డివిజన్లు!

- అసెంబ్లీ నియోజకర్గం..కొత్త డివిజన్ల హద్దులపై కసరత్తు
- పాలనా పరమైన సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు
- మున్సిపల్, జోనల్ కమిషనర్ల నుంచి అభిప్రాయ సేకరణ




**హైదరాబాద్,డిసెంబరు 1,ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరించి శివారు పట్టణ స్థానిక సంస్థలను విలీనం చేయడం ద్వారా బృహత్ హైదరాబాద్ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసం డివిజన్ల హద్దులను ఒకే అసెంబ్లీ స్థానం పరిధిలో ఉండేలా పునర్విభజన చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ విలీన ప్రక్రియ పూర్తయితే.. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం ఉన్న 150 డివిజన్లు సుమారు 300 డివిజన్లకు పెరిగే అవకాశం ఉంది. శివారు ప్రాంతాల నుంచి విలీనం కానున్న పట్టణ స్థానిక సంస్థల పరిధిలో మరో సుమారు వంద డివిజన్లు ఉన్నాయి. ఈ భారీ మార్పుకు సంబంధించిన పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలను అధికారులు రూపొందిస్తున్నారు. ఈ సందర్భంగా పరిపాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జోనల్ కమిషనర్లు, ఉన్నతాధికారులు ప్రభుత్వానికి తమ అభిప్రాయాలను సమర్పించారు. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 24 అసెంబ్లీ స్థానాలు, 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 డివిజన్లు ఉన్నాయి.

**ఒకే అసెంబ్లీ పరిధిలో ఉండేలా..**

జిహెచ్ఎంసి పరిధిలోని 150 డివిజన్లలో కొన్ని డివిజన్లు రెండు లేదా మూడు అసెంబ్లీ స్థానాల్లో విస్తరించి ఉండటం వలన పరిపాలన సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి, డివిజన్ల హద్దులు తప్పనిసరిగా ఒకే అసెంబ్లీ స్థానం పరిధిలో ఉండేట్టుగా పునర్విభజన ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు తుది నిర్ణయం తీసుకున్నారు. ఈ డివిజన్ల పునర్విభజన అనంతరం, పరిపాలనా సౌలభ్యం కోసం సర్కిళ్లు, జోన్లను కొత్తగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే జూబ్లీహిల్స్‌లోని సీజీజీ (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్)లో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన నివేదికలు, ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు స్వయంగా రెండు సార్లు సీజీజీని సందర్శించి, అధికారులు రూపొందించిన ప్రతిపాదనలు, ఇతర పత్రాలను పరిశీలించారు. శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల కమిషనర్లు కూడా తమ స్థానిక సంస్థల పూర్తి సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదించారు.

**త్వరలోఆర్డినెన్స్..**

మున్సిపాలిటీల విలీన ప్రక్రియకు సంబంధించిన ఆర్డినెన్స్ పత్రాలు ఇప్పటికే రాజ్‌భవన్‌కు చేరినట్లు తెలుస్తుంది. గవర్నర్ సంతకం చేయడమే తరువాయిగా వీలిన ప్రక్రియపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. అలాగే విలీన ప్రాంతాలతో సంబంధం లేకుండానే.. జీహెచ్ఎంసీ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందిస్తోంది. ఈబడ్జెట్‌లో ఆస్తిపన్ను ఆదాయంపైనే ప్రధానంగా దృష్టి సారించారు. రెవెన్యూ విభాగం కొత్త ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను ద్వారా రూ. 2,200 కోట్లు, ట్రేడ్ లైసెన్స్ రుసుము ద్వారా రూ. 115 కోట్లు, ప్రకటనల రుసుము ద్వారా రూ. 50 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే, నగర ప్రణాళిక విభాగం నిర్మాణ అనుమతుల రుసుము ద్వారా రూ. 1,200 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పద్దు రూ. 8,440 కోట్లు ఉండగా.. రాబోయే ఆర్థిక సంవత్సరం పద్దు సుమారు రూ. 8,600 కోట్లు వరకు ఉంటుందని ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు.

# గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై రాచకొండ సిపి సమీక్ష



**నేరెడ్ మెట్, రాచకొండ కమిషనరేట్, డిసెంబర్ 1,ప్రభాతవార్త :** ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8, 9 తేదీల్లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ కోసం చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు ప్రణాళిక, విభాగాల సమన్వయంపై రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని శాఖలు సమిష్టిగా, వేగంగా పనులు పూర్తి చేయాలని ఆయన సూచించారు. దేశ-విదేశాల నుంచి రానున్న అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలు సిద్ధంగా ఉండాలని సీపీ ఆదేశించారు. విద్యుత్ సరఫరా, సమాచార సేవలు అంతరాయం లేకుండా కొనసాగాలని, త్రాగునీరు, మరుగుదొడ్లు, రవాణా, పార్కింగ్, హెలిప్యాడ్లు వంటి వసతులను పూర్తిగా సిద్ధం చేయాలని పేర్కొన్నారు. విమానాశ్రయం నుంచి సమ్మిట్ స్థలంవరకు రహదారులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, చెత్తను తరచూ తరలిస్తూ పారిశుద్ధ్యాన్ని కాపాడాలని సూచించారు. అవసరానికి తగిన మొబైల్ మరుగుదొడ్లు, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. అగ్నిమాపక శాఖ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమ్మిట్ ఏర్పాట్లలో ఎక్కడా లోపం చోటుచేసుకోకుండా ప్రతి అధికారి బాధ్యతతో వ్యవహరించాలని సుధీర్ బాబు సూచించారు. ఈ సమావేశంలో డీసీపీ మహేశ్వరం నారాయణ రెడ్డి, ప్రోటోకాల్ శాఖ కార్యదర్శి నర్సింహా రెడ్డి, నీటి సరఫరా సంస్థ అధికారి అశోక్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, ఆర్అండ్‌బీ, అగ్నిమాపక, రవాణా, విద్యుత్, పర్యాటకం, ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించడానికే ప్రజావాణి

- ఆర్జీలపై వెంటనే స్పందించి పరిష్కరించాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఆదేశం



ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ హరిచందన దాసరి తదితరులు

**హైదరాబాద్,డిసెంబరు 1,ప్రభాతవార్త:** ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి యొక్క ముఖ్య ఉద్దేశమని, ప్రజావాణిలో ప్రజలు అందచేసిన ఆర్జీలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు కదివన్ పలని, జి. ముకుంద రెడ్డి, డిఆర్ఓ ఈ. వెంకటాచారిలతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తులను జిల్లా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు శాఖల వారీగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఒకే సమస్యపై దరఖాస్తుదారులు పదే పదే ప్రజావాణికి రాకుండా చూడాల్సిన భాధ్యత సంబంధిత శాఖల అధికారుల పై ఉందన్నారు.దివ్యాంగులు అలాగే వయోవృద్ధుల వాట్సాప్ నెంబరు ద్వారా వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 218 అర్జీలు అందాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డిఓ సాయిరాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడి రమేష్, దివ్యాంగ శాఖ సహాయ సంచాలకులు రాజేందర్, ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు ప్రవీణ్, ఆశన్న, ఇలియాస్, కోటాజీ, జి.ఎం ఇండ్రస్ట్రీస్ పవన్ కుమార్, కలెక్టరేట్ ఇంచార్జ్ ఎ. ఓవిజయ లక్ష్మి, జిల్లా సర్వే అధికారి శ్రీరామ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్జీదారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాతబస్తీ మెట్రోకు రూ.125కోట్లు విడుదల

**పరిపాలనా అనుమతులు మంజూరు**

**హైదరాబాద్, డిసెంబరు 1,ప్రభాతవార్త:** హైదరాబాద్ లోని పాతబస్తీ వాసులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఓల్డ్ సిటీ మెట్రో రైల్వే కనెక్టివిటీ పనులకు తెలంగాణ ప్రభుత్వం మరొక కీలక అడుగు వేసింది. 2025-26ఆర్థిక సంవత్సర బడ్జెట్లో భాగంగా( మెట్రో కనెక్టివిటీ టూ ఓల్డ్ సిటీ )పథకం కింద రూ.125 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్మెంట్ (బడ్జెట్) శాఖ సోమవారం జీఓ జారీ చేసింది. మంజూరైన ఈ నిధులను సంబంధిత బడ్జెట్ ప్రొవిజన్ నుంచి రిలీజ్ కానుంది. విడుదలైన మొత్తాన్ని హైదరాబాద్ ఎయిర్పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఖాతాకు మళ్లించేందుకు ట్రెజరీ శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఓల్డ్ సిటీలో మెట్రో విస్తరణకు ఇప్పటికే పలు సార్లు ప్రకటనలు వచ్చిన నేపథ్యంలో తాజా నిధుల విడుదలతో ప్రాజెక్టు పురోగతికి దోహదం కానుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

**20 మంది ట్రాన్స్‌జెండర్ సిబ్బంది భద్రతా విభాగంలో నియామకం..**

దేశంలోనే అత్యాధునిక నగర రవాణా వ్యవస్థల్లో ఒకటైన మెట్రో రైలు, మూడు కారిడార్లలో 57 స్టేషన్లతో ప్రతిరోజూ సుమారు 5 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తోంది. వీరిలో మహిళలు సుమారు 30 శాతం మంది ఉండగా, వారి భద్రత, సౌకర్యం, విశ్వాసం మెట్రో రైలు వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యత.తెలంగాణ ప్రభుత్వ సమానత్వం, గౌరవం, సమాన అవకాశాల దృష్టితో, వివిధ ప్రజా సేవా రంగాల్లో ట్రాన్స్‌జెండర్ సిబ్బంది నియామకానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వబడింది. ఈ దిశగా, హైదరాబాద్ మెట్రో రైలు ఒక ప్రగతిశీలమైన, ప్రభావవంతమైన అడుగు వేసి, 20 మంది ట్రాన్స్‌జెండర్ సిబ్బందిని భద్రతా విభాగంలో నియమించింది. ప్రత్యేక శిక్షణ పూర్తి చేసిన ఈ సిబ్బంది, సోమవారం నుండి ఎంపిక చేసిన మెట్రో స్టేషన్లలో విధులు ప్రారంభించారు. ఈ చొరవతో మహిళా ప్రయాణికుల భద్రతా వాతావరణం మరింత బలపడటమే కాకుండా, సామాజిక సాధికారతకు ప్రతీకగా నిలుస్తుంది.కొత్తగా నియమితులైన వారు , జనరల్ మరియు మహిళలకు ప్రత్యేకంగా కేటాయించిన కోచ్‌లలో భద్రతా చర్యలు చేపట్టడం, ప్రయాణికులకు దిశానిర్దేశం చేయడం, సమాచారం, అవసరమైన సహాయం అందించడానికి అందుబాటులో ఉంటారు. ప్రయాణికులు సౌకర్యవంతంగా, సురక్షితంగా వెళ్లేలా స్కానర్ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. స్ట్రీట్‌లెవెల్, కాన్‌కోర్స్ భద్రత లో కూడా పాలుపంచుకుంటారు.

# ఏఐకి 'మాటల'మాయ.. కంపెనీల డేటాకు 'ప్రాంప్ట్' గండం

**-సిపి సజ్జనార్ హెచ్చరిక**

**హైదరాబాద్, డిసెంబరు 1 ప్రభాతవార్త :** ఏఐకి 'మాటల' మాయ..కంపెనీల డేటాకు 'ప్రాంప్ట్' గండం అంటూ సోమవారం ఎక్స్ వేదికగా హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆసక్తికర పోస్ట్ నెటిజన్లతో పంచుకున్నారు. సరైన భద్రతా చర్యలు తీసుకోకపోతే సంస్థల కార్యకలాపాలు స్తంభించిపోవడంతో పాటు, విలువైన డేటా నేరగాళ్ల చేతికి చిక్కి కోలుకోలేని దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కృత్రిమ మేధ (ఏఐ) విస్తృతి పెరిగాక..చిన్న స్టార్టప్‌ల నుంచి బడా మల్టీ నేషనల్ కంపెనీల వరకు అంతా ఇప్పుడు ఏఐ చాట్‌బోట్‌ల జపం చేస్తున్నాయి. కస్టమర్ల సందేహాలకు క్షణాల్లో సమాధానాలివ్వడం, పని వేగం పెంచడం, ఖర్చు తగ్గించడం వంటి ప్రయోజనాలు ఉండటంతో సంస్థలు వీటిపై ఎక్కువగా ఆధారపడుతున్నాయి. అయితే, ఈ సాంకేతికత వెనుక ఓ సరికొత్త ముప్పు పొంచి ఉంది. అదే 'ప్రాంప్ట్ ఇంజెక్షన్.

**అసలేంటీ 'ప్రాంప్ట్ ఇంజెక్షన్'?**

సాధారణంగా ఏఐ పని చేయడానికి మనం ఇచ్చే ఆదేశాలను 'ప్రాంప్ట్' అంటారు. సైబర్ నేరగాళ్లు ఈ ప్రాంప్ట్ నే ఆయుధంగా మలుచుకుంటున్నారు. ఏఐ మోడల్‌ను తప్పుదోవ పట్టించేలా, ట్రిక్ చేసేలా 'మలీషియస్ ప్రాంప్ట్' (కీడు చేసే ఆదేశాలు) ఇస్తున్నారు. క్లుప్తంగా చెప్పాలంటే.. "ఏఐని మాటలతో మాయ చేయడం.ఇలా ఏఐని కన్ఫ్యూజ్ చేసి, సాధారణంగా బయటపెట్టకూడని సంస్థల అంతర్గత పత్రాలు, కస్టమర్ల రికార్డులు, సిస్టమ్ వివరాలను రాబట్టడమే 'ప్రాంప్ట్ ఇంజెక్షన్ అటాక్

**డేటా భద్రతకు పెను సవాల్..**

ప్రస్తుతం చాలా సంస్థలు తమ ఏఐ మోడల్స్, చాట్‌బోట్లను సంస్థలోని కీలకమైన డేటా సిస్టమ్లకు (సిఆర్ఎం డేటా, హెల్ప్‌డెస్క్ టికెట్లు, ఉద్యోగుల సమాచారం, ఫైనాన్షియల్ రికార్డులు) అనుసంధానిస్తున్నాయి. ఎండ్ యూజర్‌కు ఈ సమాచారం పొరపాటున కూడా కనిపించకూడదు. కానీ, హ్యాకర్లు వేసే ఒకే ఒక్క 'ట్రిక్కీ ప్రాంప్ట్' వల్ల ఈ గోప్య సమాచారమంతా బయట పడే ప్రమాదం ఉంది.

**గార్డెయిల్స్'తోనే రక్షణ**

ఈ ముప్పును పసిగట్టి, నివారించడానికి సంస్థలు తక్షణమే 'ప్రాంప్ట్ గార్డెయిల్స్' (రక్షణ కవచాలు) ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం ఒక అంచె భద్రత సరిపోదు, మల్టీలేయర్ డిఫెన్స్ విధానాన్ని పాటించాలి.

**జాగ్రత్తలివే!** -మోడల్‌లెవల్ సెక్యూరిటీ: ఏఐకి సేఫ్టీ ట్రైనింగ్ ఇవ్వడం, కఠినమైన నిబంధనలు విధించడం ద్వారా అనవసర సమాచారాన్ని ఇవ్వకుండా నియంత్రించాలి.

# అనుమతులు లేని నిర్మాణంపై ఉక్కుపాదం

- అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు
- సర్కిల్ టాన్‌ప్లానింగ్ ఎసిపి శ్రీధర్

**అత్తాపూర్ డిసెంబరు1,ప్రభాతవార్త :** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ టౌన్‌ప్లానింగ్ ఎసిపి శ్రీధర్ పేర్కొన్నారు.సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ అంబీయన్స్ ఫోర్ట్‌లోని అనుమతులు లేని అదనపు అంతస్తులు, సెట్‌బ్యాక్ నిర్మాణాలపై సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి ఆదేశాలతో జీహెచ్ఎంసీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య టౌన్ ప్లానింగ్ అధికారులు ఉక్కుపాదం మోపారు.ఈ సందర్భంగా ఎసిపి శ్రీధర్ మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ అనుమతులు తీసుకొని జిహెచ్ఎంసి నిబంధనలు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కూల్చివేతలను పరిశీలిస్తున్న టౌన్‌ప్లానింగ్ ఎసిపి శ్రీధర్

# పేక మేడలా.. లేక కాంక్రీట్ మేడలా..

- 80 గజాల్లోనూ బహుళ అంతస్తుల భవనాలు
- చోద్యం చూస్తున్న నిజాంపేట మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు

**నిజాంపేట్, డిసెంబర్ 1, ప్రభాతవార్త** నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం జరుగుతున్నా నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కిమ్మనడం లేదు. కేవలం 80 గజాల్లోనే ఆకాశమే హద్దుగా అన్నట్లుగా అంతస్తులపై అంతస్తులు నిర్మించుకుంటూపోతున్నా కళ్లకు కనిపించడం లేదు. వాటిని చూస్తే పేక మేడలా.. లేక కాంక్రీట్ మేడలేనా.. అన్న సందేహం రాక మానదు. నిజాంపేట్ మున్సిపల్ పరిధిలోని బాచుపల్లి 21వ డివిజన్ (సర్వేనెబర్ 186) సాయినగర్ శ్మశానవాటిక పక్కన నిబంధనలకు విరుద్ధంగా 80 గజాల స్థలంలో భవన నిర్మాణం చేపడుతున్నారు. వాస్తవంగా జీ ప్లస్ 2కు మించి అనుమతులు ఉండవు. అలాంటిది ఎన్ని అంతస్తులైనా వేసుకుంటాం. తమనెవరు అడ్డుకునేది అన్న రీతిలో భవన నిర్మాణదారులు దర్జాగా నిబంధనలకు పాతరేస్తూ బహుళ అంతస్తులను నిర్మిస్తున్నారు. అది కూడా కనీసం అంగుళం జాగా కూడా సెట్బ్యాక్ కోసం వదలకుండా నిర్మాణం చేపడుతున్నారు. అసలే అనుకోని ప్రమాదం జరిగితే ఫైరింజన్, అంబులెన్సులు కూడా వెళ్లలేనివిధంగా ఇక్కడ బహుళ అంతస్తుల నిర్మాణాలు జరిపారు. ఒకదానిని ఆనుకుని మరొకటి అంగుళం జాగా లేకుండా నిర్మాణాలు జరిపారు. ఇవేమీ పట్టనట్లు మున్సిపల్ టౌన్ప్లానింగ్ అధికారులు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఎక్కడ నిర్మాణం జరిగినా చేయి తడపనిదే సదరు నిర్మాణాన్ని ముందుకుసాగనీయరన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చేయి తడిసిందే తడవుగా ఇక ఆ నిర్మాణం జోలికి వెళ్లరు. ఇదిలా ఉంటే నిర్మాణదారులు ఎన్ని అంతస్తులు వేస్తే అంత తమకు లాభిస్తుందన్న ధోరణితోనే అధికారులు ఉన్నట్లు కనిపిస్తోంది. ఎందుకంటే ఒక్కో అంతస్తుకు ఒక్కో రేటు కట్టి నిర్మాణదారులను డిమాండ్ చేసి సొమ్ము చేసుకోవచ్చన్న ఆలోచనలో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫ్లోర్‌కు ఇంత సమర్పించుకుంటేనే నిర్మాణం ముందుకు కదిలేది. అది ఎన్ని గజాలైనా సరే.. ఎన్ని అంతస్తులైనా సరే. అప్పుడు వారికి నిబంధనలు వర్తించవు. ఇక చేసేదేమీ లేక అడిగినంత సమర్పించుకుని నిర్మాణదారులు తమ పనిని కానిచ్చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరపడం ద్వారా భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే దానికి బాధ్యులు ఎవరన్నది ప్రశ్నార్థకం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సాయినగర్ నిబంధనలకు విరుద్ధంగా జరుపుతున్న నిర్మాణంపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అక్రమ బిల్డింగ్

**అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు పెడతాం : టౌన్ ప్లానింగ్ సీనియర్ అసిస్టెంట్ ప్రతాప్ సింగ్**

నిజాంపేట్ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ సీనియర్ అసిస్టెంట్ ప్రతాప్ సింగ్ ప్రభాతవార్త వివరణ అడిగితే నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని, అనుమతికి మించి నిర్మించిన భవనాలన్నింటినీ కూల్చివేస్తామని స్పష్టం చేశారు. బిల్డర్లు, ప్రజలు టౌన్ ప్లానింగ్ నిబంధనల మేరకే భవనాలు నిర్మించుకోవాలని ఉల్లంగించిన వారిపై క్రిమినల్ కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు.

## ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే మర్రి



కాలనీ వాసులుతో ఎమ్మెల్యే

**అల్వాల్ డిసెంబరు 1 ప్రభాతవార్త:**
ప్రజా సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అల్వాల్ డివిజన్ పరిధిలోని కిష్టమ్మ ఎన్‌క్లేవ్‌లో స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డితో కలిసి పర్యటించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్పు, రోడ్లు, పొదలు తొలగింపు తదితర సమస్యలను కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. డివిజన్ సమగ్రాభివృద్ధికి తన సహకారం ఉంటుందని మర్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు ప్రేమ్, నరేందర్ రెడ్డి, శరణగిరి, ప్రేమ్ కుమార్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నాం

**- బండ్లగూడ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర**



బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారిపై స్వీపింగ్ చేయిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

**నార్సింగి, డిసెంబర్ 1 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని కమీషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. సోమవారం ఉదయం కార్పొరేషన్ పరిధిలోని 11.వ,డివిజన్ దర్గా కలిస్కాన్, 20.వ,డివిజన్‌లోని కాళీమందిర్ జంక్షన్, 13.వ,డివిజన్‌లోని సన్‌సిటీ ప్రధాన రహదారులపై శానిటేషన్ కార్మికుల చేత చెత్తను ఎత్తించారు. ఈ పనులను కమీషనర్ దగ్గరుండి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్లు, ఇంటి పరిసరాలు, రోడ్లను పరిశుభ్రంగా ఉంచుంటునే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఎక్కడ చెత్త నిలువ ఉంటుందో అక్కడ విష జ్వరాలను వ్యాపింపచేసే వైరస్‌లు, బ్యాక్టీరియాలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను రోడ్లపై వేయకూడదని, విధిగా ఇళ్లముందుకు వచ్చే ఆటోలలోనే వేయాలని సూచించారు. రోడ్ల పక్కన ఎవరు చెత్త వేసినా భారీ జరిమానాలు విధిస్తామని కమీషనర్ శరత్‌చంద్ర హెచ్చరించారు. స్వచ్ఛ బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌గా మార్చేందుకు ప్రజలంతా తమకు సహకరించాలని కమీషనర్ తెలిపారు. ప్రధాన రహదారులపై పని చేసే కార్మికులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్.ఐ వెంకట్‌రెడ్డి, జవాన్లు మీర్జా తౌఫిక్, నరేందర్, రామానుజులు, వెంకటేష్, రాము పాల్గొన్నారు.

## హెచ్ఐవి నియంత్రణకు అందరూ భాగస్వాములు కావాలి




ప్రసంగిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి

**చిక్కడపల్లి డిసెంబర్ 1 ప్రభాతవార్త :** రాష్ట్రంలో హెచ్ఐవి నియంత్రణకు అందరు భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో వరల్డ్ ఎయిడ్స్ డే పురస్కరించుకుని సుందరయ్య పార్క్ నుండి ఆర్టీసీ కళాభవన్ వరకు హెచ్ఐవి ఎయిడ్స్ పై నిర్వహించిన ర్యాలీని సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్, ఉస్మానియా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీ కళాభవన్ లో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ఉస్మానియా యూనివర్సిటీ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు హెచ్ఐవి అవగాహన ఏర్పాటు చేసుకొని ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి అనురాధ, అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పురుషోత్తం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయించాలి : మాణిక్‌రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్‌రెడ్డి

**నిజాంపేట్, డిసెంబర్ 1, ప్రభాతవార్త**
ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయించాలని, పెండింగ్ డీఏలు వెటనే ఇవ్వాలని విటిటిటి ప్రధాన సంపాదకులు పాపన్న గారి మాణిక్‌రెడ్డి అన్నారు. సోమవారం టీఎస్ యుటిఎఫ్ మేడ్చల్ జిల్లా విస్తృత కమిటీ సమావేశం రాష్ట్ర కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు జయ సింహ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఎన్నో సంవత్సరాల నుండి పనిచేస్తున్న ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని వివో టి టి ప్రధాన సంపాదకులు పాపన్నగారి మాణిక్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్ఎస్‌ను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాలల్లో విద్యాసంవత్సరపు కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయుల ఇతర పెండింగ్ సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటప్ప మాట్లాడుతూ యుటిఎఫ్ నిరంతరం ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నదని అన్నారు. పెండింగ్ బిల్లుల వల్ల ఉపాధ్యాయులకి ఉన్న ఇబ్బందులను గుర్తించి పెండింగ్ బిల్లులని వెంటనే చెల్లించాలన్నారు. సిపిఎస్ రద్దు చేసి అందరికీ పాత పెన్షన్ అమలు చేయాలని జిల్లా అధ్యక్షులు జయ సింహ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్ రెడ్డి, ఉపాధ్యక్షులు రాకేష్ వందన జిల్లా కోశాధికారి గొడుగు శ్రీనివాస్, కార్యదర్శులు మహి పాల్ రెడ్డి, కుమారస్వామి, నీరజ, విజయ భాస్కర్ రెడ్డి, సుధాకర్, ఆయా మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండల నాయకులు, ప్రాథమిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళి



కానిస్టేబుల్ కిష్టయ్యకు నివాళులర్పిస్తున్న కాసాని వీరేష్ ముదిరాజ్



గాజులరామారం చౌరస్తాలో స్థానిక ముదిరాజ్ సంఘం వారి ఆధ్వర్యంలో కిష్టయ్యకి నివాళులు అర్పిస్తున్న దృశ్యం




కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తా ముదిరాజ్ జండా దగ్గర కిష్టయ్యకు నివాళులర్పిస్తున్న దృశ్యం



వట్టినాగులపల్లిలో తెలంగాణ అమరవీరుడు పోలీసు కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం.

**నిజాంపేట్, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర సాధన మలి దశ ఉద్యమ తొలి అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతి సందర్భంగా గన్‌పార్క్, తెలంగాణ ముదిరాజ్ భవన్, ఉస్మానియా యూనివర్సిటీ వద్ద కిష్టయ్య ముదిరాజ్‌కి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్, బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ ప్రముఖ నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.

**గాజులరామారం చౌరస్తాలో**
**జీడిమెట్ల, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** తెలంగాణ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతి వేడుకలు సోమవారం గాజులరామారం చౌరస్తాలో స్థానిక ముదిరాజ్ సంఘం వారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కానిస్టేబుల్ పూటకొక్కుల కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులార్పించారు. అనంతరం ముదిరాజ్ జర్నలిస్ట్ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సుగ్రీవుడు ముదిరాజ్, కార్యదర్శి బక్కని పాండురంగం, తెలంగాణ ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు దొంతులు రమేష్ ముదిరాజ్‌లు మాట్లాడుతూ తన చావుతోనైనా ప్రత్యేక తెలంగాణ రావాలని తన సర్వీస్ తుపాకీతో కాల్చుకొని ప్రాణాలు వదిలి తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసినా ఘనత పోలీస్ కిష్టయ్యది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బండారి శ్రీధర్ ముదిరాజ్, లక్ష్మణ్ ముదిరాజ్, కంచిగారి రాజు ముదిరాజ్, వెంకటస్వామి, సత్తయ్య, గాజులరామారం ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు జీతయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తాలో**
**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** తెలంగాణ కోసమే అమరుడైన పోలీస్ కిష్టయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి అంటే ఇప్పుడున్న యువత స్థానిక ఎన్నికల్లో ముందుకు రావాలని, అమరవీరుడైన పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ తొలి అమరుడుగా ప్రభుత్వం ప్రకటించాలని రాష్ట్ర కార్యదర్శి గుమ్ముల స్వామి ముదిరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ 16వ వర్ధంతి కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తా ముదిరాజ్ జండా దగ్గర పలువురు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి గుమ్ముల స్వామి ముదిరాజ్, కోల రవీందర్ ముదిరాజ్, పెంటయ్య ముదిరాజ్, గుమ్మడి మధుసూదన్ ముదిరాజ్, రామకృష్ణ ముదిరాజ్, నర్సింలు ముదిరాజ్, నరేందర్ ముదిరాజ్, శివ ముదిరాజ్ రాములు ముదిరాజ్, తోడేటి సత్యం ముదిరాజ్, రవి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**వట్టినాగులపల్లిలో**
**నార్సింగి, డిసెంబర్ 1 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోలీసు కానిస్టేబుల్ కిష్టయ్య చేసిన ఆత్మ బలిదానంతోనే మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడిందని కాంగ్రెస్ సీనియర్ నేత ధర్మపురి ముదిరాజ్ పేర్కొన్నారు. సోమవారం గండిపేట మండలం వట్టినాగులపల్లిలో కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ధర్మపురి, అరుణ్ కుమార్‌లు మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం చేస్తూ, తెలంగాణకు జరుగుతున్న అన్యాయం పట్ల ఆవేదన చెంది ఆత్మబలిదానం చేసుకున్నారని తెలంగాణ బిడ్డలమంతా కిష్టయ్యకు ఋణపడి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా కిష్టయ్య అమర్ హై అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.

## ఎల్లమ్మగూడం నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**-బిసి జనసభ రాష్ట్ర అధ్యక్షులు రాజారాం యాదవ్**




సమావేశంలో అభివాదం చేస్తున్న రాజారాంయాదవ్, చెరుకు సుధాకర్, వెంకటేష్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్,డిసెంబరు 1,ప్రభాతవార్త:**
నల్లగొండ జిల్లా ఎల్లమ్మగూడం వాస్తవ్యులు మామిడి యాదగిరి యాదవ్‌ను నకిరేకల్‌లో కిడ్నాప్ చేసి...కారులో రోజంతా తిప్పుతూ ఓఆర్ఆర్ సమీపంలో ఉన్న దట్టమైన అడువులలోకి తీసుకెళ్లి చిత్రహింసలకు గురి చేస్తు, కులం పేరుతో దూశించడమే కాక నామినేషన్ దాఖలు చేస్తే హత్య చేస్తామని కత్తులతో భయబ్రాంతులకు గురి చేయడమే కాకుండా హత్యాయత్నం చేసిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి అనుచరులపై చర్యలు తీసుకోవాలని అలాగే మంత్రిని వెంటనే భర్తరఫ్ చేయాలని బిసి జనసభ రాష్ట్ర అధ్యక్షులు రాజారాంయాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఘటన జరిగి రెండుమూడురోజులైనా పోలీసులు నిందితులపై కేసు నమోదు చేయకపోగ పోలీసులే కేసు వెనక్కు తీసుకోవలని బెదిరించడం బాధాకరమన్నారు. గతంలోను చెరుకు సుధాకర్, పున్నా కైలాష్ నేతపై కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇటువంటి దాడుల దోరణికే పాల్పడ్డారని.....బిసి సమాజం మొత్తం ఏకమై కోమటిరెడ్డికి బుద్ది చెప్పాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చెరుకు సుధాకర్ మాట్లాడుతూ గతంలోనూ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అణగారిన వర్గాలపై ఇటువంటి దాడుల దోరణే కొనసాగించారన్నారు. నల్లగొండ జిల్లాలో వెనుకబడిన కులాలు రాజకీయంగా ఎదగడం కోమటిరెడ్డి సహించలేక పోతున్నారని..గతంలోను తనపై ఇటువంటి దాడికే పాల్పడారని అన్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇటువంటి ధోరణి మార్చుకోకపోతే రాబోయే ఎన్నికల్లో బిసిలు బుద్ది చెప్తారని హెచ్చరించారు. యాదవ హక్కులు పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ మాట్లాడుతూ యావత్ తెలంగాణ బిసి సమాజం బాధితులకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు.నల్లగొండ జిల్లా రెడ్డీల అహంకార ధోరణికి యాదవులు తిరగబడి,వారిని రాజకీయంగా బొందపెట్టాలన్నారు.ఈ మీడియా సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ జాతియ కార్యదర్శి రమేష్ యాదవ్, బిసి సంఘాల జెఎసి అధ్యక్షుడు వోరగంటి వెంకటేష్ గౌడ్,అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కార్యదర్శి లొడంగి గోవర్ధన్ యాదవ్ బిసి కుల సంఘాల అధ్యక్షుడు,కాటం నర్సింహ యాదవ్,బేరి రామచంద్రయ్య యాదవ్,కొమ్మనబోయిన సైదులు,వీరబోయిన లింగయ్య,కడారి రమేష్,నూకల మధు,శ్రీధర్, రమేష్ బలిజ ,వినోద్ యాదవ్ తథితరలు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో ఉద్యానవనంలో రహదారి నిర్మాణం..స్థానికుల ఫిర్యాదు



ఉద్యానవనంలో చేపడుతున్న రహదారి నిర్మాణం

**జూబ్లీహిల్స్ డిసెంబరు 1, ప్రభాతవార్త:**
దాదాపు 45 ఏళ్లుగా ఉన్న ఉద్యానవనాన్ని తొలగించి చేపడుతున్న రహదారి నిర్మాణం విషయంలో స్థానిక నివాసితులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నం.1 66 కూడలిలో ఉన్న ఈ పార్కు జూబ్లీహిల్స్ సొసైటీ ఆమోదించిన లేఅవుట్ ప్రకారం 0.30 ఎకరాలు (సుమారు 1600 గజాలు) విస్తీర్ణం కలిగిఉంది. ప్రస్తుత కొలతల ప్రకారం పార్కు విస్తీర్ణం కేవలం 1200 గజాలు మాత్రమే ఉండటం వల్ల 400 గజాలు తగ్గిపోయింది. ఈ పార్కులో జిమ్ పరికరాలు ఏర్పాటుచేసి స్థానికులు వినియోగిస్తున్నారు. కాగా ఇటీవల కొందరు జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ సొసైటీకి చెందిన వ్యక్తులుగా చెప్పుకున్నవారు పార్కు సరిహద్దు గోడను కూల్చి రోడ్డు వేసే పనులు మొదలుపెట్టారని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎలాంటి మున్సిపల్ అనుమతులు లేకుండానే పార్కు, 1299కె ప్లాట్ మధ్య రోడ్డు ఉందని చూపిస్తూ పనులు చేయడం ప్రారంభించారు. భూమి సర్వే చేయకుండానే అనుమతులు లేకుండా రోడ్డు పనులు చేపట్టారని స్థానికులు అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అదనంగా, పార్కుకు మిగిలే స్థలం లేఅవుట్‌లో చూపించిన దానికంటే చాలా తక్కువగా ఉందని, ప్రతిపాదిత రోడ్డు స్థానికులకు ఉపయోగం ఉండదని నివాసితులు చెప్పారు. అంతేకాకుండా ఆ ప్రాంతంలో 200 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ప్రమాదాలకు అవకాశం ఎక్కువగా ఉంటుందని అన్నారు. అక్రమంగా పార్కును తొలగించడం, చెట్లు నరికి వేయడంపై తక్షణ చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులకు స్థానికులైన అనిత నాగుళ్లపల్లి, టి. హనుమంతరావు తదితరులు తాము ఇచ్చిన ఫిర్యాదులో కోరారు.

## సీనియర్ సిటీజెన్స్‌కు భవన నిర్మాణం చేయించాలని ఎమ్మెల్యేకు వినతి



బండ్లగూడ కార్పొరేషన్‌లోని సీనియర్ సిటీజన్స్ కు భవన నిర్మాణం చేయాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**నార్సింగి, డిసెంబర్ 1 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని సీనియర్ సిటీజెన్స్‌కు భవన నిర్మాణంను చేయించాలని కోరుతూ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వయోజనులంతా కలిసి వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ సిటీజెన్స్ అసోసియేషన్ ప్రతినిధులు శివరాంరెడ్డి, ఆనంద్‌రెడ్డిలు మాట్లాడుతూ కార్పొరేషన్‌లోని అన్ని గ్రామాలు, కాలనీల్లో వాటర్‌బిల్స్ చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెద్ద ఎత్తున పేరుకుపోయిన బిల్స్ కట్టలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, జల మండలి ఎండితో మాట్లాడి ఈ బిల్లులను 50.శాతానికి తగ్గిస్తే 90.వాతం మంది ప్రజలు బిల్లులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అలాగే కిస్మత్‌పూర్‌లోని 155. ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఐటీ పార్కులకు అప్పగించబోతుందని, దానిలో ఐదు ఎకరాల స్థలంను కార్పొరేషన్‌కు తీసుకొని అందులో వాకింగ్ ట్రాక్, మినీ స్టేడియం, స్పోర్ట్స్ కోసం కేటాయించాలని ఎమ్మెల్యేకు ఇచ్చిన వినతిపత్రంలో కోరామని వివరించారు. వినతిపత్రం అందుకున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్పందిస్తూ సీనియర్ సిటీజన్ల న్యాయమైన డిమాండ్లు కోరారని, వాటన్నింటిని తీర్చేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఎమ్మెల్యే స్పందన పట్ల సీనియర్ సిటీజెన్లు సంతోషంను వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, మాజీ ఎంపిటిసి గోకరి సురేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సాగర్ గౌడ్, సీనియర్ సిటీజెన్స్ కామేశ్వర్‌రావ్, కృష్ణారావ్, మల్లన్న, శ్యామూల్‌గౌడ్, జానకీ రాములు, రామలింగం, బాపిరెడ్డి, ప్రసాద్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## గతి తప్పిన రుతువు మహిళా చైతన్య నవలా : జస్టిస్ చంద్రకుమార్



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ చంద్ర కుమార్, చిత్రంలో కళారత్న బిక్కి కృష్ణ తదితరులు

**చిక్కడపల్లి డిసెంబర్ 1 ప్రభాతవార్త :** ప్రముఖ రచయిత్రి డా.మామిడాల శైలజ రాసిన గతి తప్పిన రుతువు నవల మహిళా చైతన్య కరదీపిక గా నిలుస్తుందని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ పేర్కొన్నారు.భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్, అభ్యుదయ రూరల్ డెవలప్ మెంట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో జరిగిన గతి తప్పిన రుతువు పుస్తకావిష్కరణ, జాతీయ ప్రతిభా లెజెండరీ పురస్కారాల మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ప్రముఖ కవి కళారత్న డా.బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో చంద్రకుమార్ డా.మామిడాల శైలజ నవలలోని అనేక సన్నివేశాలను ఉదహరించారు.బి.సి.కమీషన్ పూర్వ చైర్మన్ బి.ఎస్ రాములు మాట్లాడుతూ రచయిత్రి డా.శైలజ సాహసంతో నవలను రాశారని అభినందించారు.గోరేటి వెంకన్న మాట్లాడుతూ డా.మామిడాల శైలజ నవల యుక్తవయసులో ఉన్న యువతుల్లో చైతన్యం కలిగిస్తుందన్నారు.బిక్కి కృష్ణ ప్రతిభావంతులను గుర్తించి పురస్కారాలతో ప్రోత్సహించడం ఇతరులకు మార్గదర్శకమవుతుందన్నారు.ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త డా.ఆలూరు సుభాష్ బాబుకు "మహామహోపాధ్యాయ విద్యా ఉద్యోగ కల్పనా సార్వభౌమ"బిరుదుతో పాటు జాతీయ జీవన సాఫల్య లెజెండరీ పురస్కారాన్ని అందజేశారు.అలాగే సినీ దర్శకులు నగేష్ నారదాసి,బాణాలు వెంకటేశ్వరరావు. డా.శాంతిశ్రీ,మారే పెల్లి భువనేశ్వరి,బి.సుజాత,డా.రమణ యశశ్వి,స్వర్ణాగౌడ్,డా.రఘు ఆరికపూడి తదితరులకు జాతీయ జీవన సాఫల్యపురస్కారాలు అందజేశారు.ఈ వేడుకల్లో ప్రముఖ కవులు డా.జెల్ది విద్యాధర్, డా.నాళేశ్వరం శంకరం,,గిడుగు కాంతికృష్ణ,యలవర్తి ధనలక్ష్మి, శ్రీమ. డా.రాధాకుసుమ,డా.కోగంటి ఉషారాణి,పద్మశ్రీ లత,శ్రీపేరి,శిల్పిక తదితరులు పాల్గొన్నారు.డా.రాధా కుసుమ ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనం సభికులను అలరించింది.వివిధ రంగాల్లో విశిష్ట సేవలు చేసిన రెండు రాష్ట్రాల సాహితీవేత్తలు,సంఘసేవకులను అతిథులు ఘనంగా సన్మానించారు.

## కవయిత్రి రమ్య స్వరూప్ రచించిన గ్రంథాల ఆవిష్కరణ



కవయిత్రి డాక్టర్ రమ్య స్వరూప్ రచించిన గ్రంథాలను ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి డిసెంబర్ 1 ప్రభాతవార్త :**
రామదాసు సాహితీ కళా సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యురాలు, కవయిత్రి డాక్టర్ రమ్య స్వరూప్ రచించిన రమ్య మంజరి, నవ పల్లకి గ్రంథాలయ ఆవిష్కరణ సభ సోమవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగానసభలో గుండవరపు హనుమంత రావు కళావేదికలో వైద్యుడు డాక్టర్ పల్లెర్ల స్వరూప్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఆధ్యాత్మిక, సామజిక సేవా ప్రముకురాలు కొణిజేటి ఉష హాజరై గ్రంథాల ఆవిష్కరణ సభలో పాల్గొన్నారు. రమ్య మాంజలి రచించిన గ్రంథాలు ఆలోచింప చేసేలా ఉన్నాయని ప్రసంగించారు. రమ్య మంజరి గ్రంథాన్ని వైద్యుడు డాక్టర్ బీచ కంఠయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు పద్మ, నవపల్లకి గ్రంథాన్ని విశ్రాంత ఆర్డినెన్సు ఫ్యాక్టరీ పల్లెర్ల సుధాకర్, ప్రముఖ వ్యాపారి వందన ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీక్ష,శ్రీథన్ తదితరులు పాల్గొన్నారు. సింగరేణి కాలరీస్ విశ్రాంత అదనపు జిమ్ గార్లపాటి ఈశ్వరయ్య, ప్రముఖ కవయిత్రి, కుసుమ ధర్మన్న కళాపీఠం వ్యవస్థపై అధ్యక్షురాలు డాక్టర్ రాధా కుసుమ, ఉదయ సాహితి రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం లక్ష్మయ్య, ప్రముఖ కవులు భీమా శ్రీనివాస్ రావు, దూత రామకోటేశ్వర్ రావు పాల్గొన్నారు.

## రాంలీలా మైదానం పర్యవేక్షణ



రాంలీలా మైదానం పర్యవేక్షి ఒస్తున్న డిప్యూటీ కమిషనర్ నరసింహ రెడ్డి, కార్పొరేటర్ హేమలత సురేష్

**జీడిమెట్ల, డిసెంబర్ 1, ప్రభాతవార్త**
సూరారం కాలనీలోని రామ్ లీలా మైదానాన్ని సోమవారం డిప్యూటీ కమిషనర్ నరసింహ రెడ్డి, కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి పర్యవేక్షించారు. రామ్ లీలా మైదాన్ డెవలప్మెంట్ అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్నటువంటి ట్రాఫిక్ సమస్యను వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రవి, రంగారావు, జవాన్ జిలాని, హుస్సేన్, ఎస్ఎఫ్ఐ లు తదితరులుపాల్గొన్నారు

## గల్బవీధిలో సిసి రోడ్డు ఏర్పాటు



గల్బవీధిలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్

**చార్మినార్,డిసెంబరు 1 ప్రభాతవార్త :** పురానాపూల్ డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నానని పురానాపూల్ డివిజనన కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ అన్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు పురానాపూల్ డివిజన్ పరిధిలోని గల్బవీధిలో ఆయన పర్యటించారు.గల్బవీధిలో కొత్త సిసి రోడ్డును వేయాలని బస్తీ వాసులు కార్పొరేటర్‌ను కోరారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ మాట్లాడుతూ గల్బవీధిలో కొత్త రహదారిని త్వరలో ఏర్పాటు చేస్తామని,అందుకు కావలసిన ప్రతిపాదనాలు అధికారులకు పంపించటం జరిగందని తెలిపారు.కార్యక్రమంలో గల్బవీధి బస్తీ వాసులు ఎం.విష్ణుగౌడ్,ఎం.సందీప్ గౌడ్,రవిగౌడ్ పాల్గొన్నారు.

## బృందావన్ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

**- కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి**



బృందావన్ కాలనీలో పర్యటిస్తున్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి,డిసెంబరు 1 ప్రభాతవార్త :**
రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో కలిసి బృందావన్ కాలనీని సందర్శించారు.బృందావన్ కాలనీలో అస్తవ్యస్థంగా ఉన్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు పాండు యాదవ్,బిజెపి నాయకులు రావుల భాస్కర్,బుచ్చిరెడ్డి, బబ్లూ,తలారి చిన్న,శ్రీకాంత్ రెడ్డి,ఎల్‌వి రెడ్డి,ఎన్ను శంకర్ రెడ్డి,వివేక్,జంగయ్య,జైరాం పందరి నాథ్,రాజేష్, జ్ఞానేశ్వర్, వెంకటేష్,వీరేష్,సునీల్,సూర్య,రాధేశ్యాం,బస్తీ వాసులు, వాటర్ వర్క్స్ సీవరేజ్ అధికారులు పాల్గొన్నారు.

## 7న శిల్పకళావేదికలో సంగీత కచేరి

**హైదరాబాద్,డిసెంబరు 1,ప్రభాతవార్త:**
హైదరాబాద్ నగరం త్వరలో ఓ అసాధారణ సంగీత మహోత్సవానికి వేదిక కానుంది. సితార్ వాద్యకళావిద్యలో సిద్ధహస్తుడైన నీలాద్రి కుమార్ రూపొందించిన వినూత్న సంగీత ప్రదర్శన ఇండియా డ్రీమ్ ఒకటే మూలం, అనేక మెలొడీలు" అనే థీమ్ మ్యాజిక్ డిసెంబర్ 7న శిల్పకళా వేదికపై ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయనుంది. ఈమేరకు సోమవారం పర్యాటకభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు రేష్మా, ముకేష్‌అగర్వాల్‌లు లు మాట్లాడుతూ ముంబయిలోని ఎన్ఎంఏసిసిలో తన తొలి ప్రదర్శనతోనే ఘన విజయం సాధించి, ఇప్పుడు హైదరాబాద్‌కు మరింత విస్తరించిన రూపంలో, లోతైన అనుభూతితో వస్తున్నారన్నారు. భారతీయ సంగీతంలో ఇండియన్ డ్రీమ్ అనేది కేవలం ఓ సంగీత కచేరి మాత్రమే కాదు భారతీయ సంగీత గుండె చప్పుడులోకి తీసుకెళ్లే ఓ ఆత్మీయ ప్రయాణం అన్నారు. ప్రాచీన రాగాల నుంచి ఆధునిక ధ్వనుల వరకూ, సంప్రదాయం నుంచి సృజనాత్మక నవీనత వరకూ ఈ కచేరీ భారతీయ సంగీత వికాస గాథను సంగీత రూపంలో ఆవిష్కరిస్తుందన్నారు. నీలాద్రి కుమార్ సితార్, జితార్‌ల మాయాజాలంతో గతం-భవిష్యత్ సమన్వయాన్ని శ్రవణానందంగా మార్చనుందని పేరొక్కన్నారు. ఇక్కడకు వచ్చే దేశంలోని అత్యుత్తమ సంగీతకళాకారులు సితార్, జితార్: నీలాద్రికుమార్ తబలా: సత్యజిత్ తల్వాల్కర్ కీబోర్డ్: అగ్నెలో ఫెర్నాండెజ్ డ్రమ్స్: సమ్బిత్ ఛటర్జీపెర్క్యూషన్: శిఖర్ నాద్ ఖురేషీ ఫ్లూట్: హ్రిషికేష్ మజుందార్ ఇలా ఇంకెందరో లబ్ధప్రతిష్ఠులైన సంగీత కళాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

## గృహిణి సహా ఇద్దరు చిన్నారుల అదృశ్యం

**సరూర్‌నగర్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గృహిణి తన ఇద్దరు చిన్నారులతో సహా అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బడంగ్‌పేట్ కమాన్ సమీపంలోని న్యూ బృందావన్ కాలనీకి చెందిన ప్రీతి కుమారి (23) అనే గృహిణి తన ఇద్దరు పిల్లలు సబా (3), సూఫీ (2) లతో కలిసి గత శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో ఎవ్వరికీ సమాచారం ఇవ్వకుండా ఇంటి నుండి వెళ్ళి తిరిగి రాలేదు. దీంతో మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో మిస్సింగ్ కేసు కింద నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 1, ప్రభాతవార్త**
రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నవంబర్ 29న గుండ్ల పోచంపల్లిలోని మున్సిపల్ ఆఫీస్ సమీపంలో ఎన్.యాదగిరి (65) పెరుగు ప్యాకెట్ కోసం రోడ్ దాటుతుండగా అయోధ్య ఎక్స్ రోడ్ నుండి గుండ్ల పోచంపల్లి వైపు వెళ్లే గూడ్స్ ఆటో ఢీ కొట్టగా తీవ్ర గాయలతో అక్కడిక్కడే మృతి చెందాడు.యాద గిరి కుమారుడు వీరేష్ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అజాద్‌నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కాలేరు

**హైదరాబాద్, డిసెంబరు 1 ప్రభాతవార్త:**
కాచిగూడ డివిజన్‌లో మౌలానా అజాద్ నగర్‌లో పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సోమవారం శ్రీకారం చుట్టారు. కార్పొరేటర్ కన్నా ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి ఆయన డివిజన్‌లోని ఆనేక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ముఖ్యంగా అజాద్ నగర్ బస్తీ దవాఖానాలో 10 లక్షల ఖర్చుతో నిర్మించబోయే టాయిలెట్, షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే 49 లక్షలతో నిర్మించే వర్షపు నీటి లైన్, సిసి రోడ్డు నిర్మాణపు పనులకు వారు కూడా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు ప్రవీణ్, ప్రశాంత్, సూర్య, శ్రీధర్, కృష్ణ, డివిజన్ అధ్యక్షురాలు భీష్మదేవి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఓం ప్రకాష్‌యాదవ్, బస్తీ నాయకులు, పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 1, ప్రభాతవార్త**
అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నవంబర్ 30.11. 2025 రాత్రి సుబాష్ నగర్ హనుమాన్ దేవాలయం సమీపంలో జగదీష్ రెడ్డి (26) తీవ్రమైన గాయాలతో కనిపించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వెంటనే సంఘర్షణ స్థలానికి చేరుకొని, చికిత్స నిమిత్తం జగదీశ్ రెడ్డిని మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. డ్యూటీ డాక్టర్ పరీక్షించి జగదీశ్ రెడ్డి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ప్రాథమిక పరిశీలనలో మృతుడికి కత్తిపోటు గాయాలు ఉన్నట్లు పోలీసులు నిర్ధారించబడింది. మృతుడి తల్లి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## పవర్‌లిఫ్టింగ్‌లో మెరిసిన చిన్నారి అద్భుత ప్రతిభ




**నేరెడ్‌మెట్ డిసెంబర్ 1,ప్రభాతవార్త :**
నాలుగేళ్ల చిన్నారే పవర్‌లిఫ్టింగ్ రంగంలో రాష్ట్రస్థాయిలో మెరిసి అందరి దృష్టిని ఆకర్షించింది. అమీన్పూర్‌లోని శ్రీ బాలాజీ గ్రాండ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన డబ్ల్యుపిసి తెలంగాణ నాలుగో ఓపెన్ స్టేట్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో యాప్రాల్‌కు చెందిన ఈ చిన్నారి 20 కిలోల విభాగంలో పతకం సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది. వయసుతో పోలిస్తే చూపిన ఆత్మవిశ్వాసం, ప్రదర్శన, ఫిట్‌నెస్ ప్రతిభావంతులను కూడా ఆశ్చర్యపరిచేలా చేసింది.ఈ సందర్భంగా ప్రధాన అతిథిగా పాల్గొన్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చిన్నారిని అభినందిస్తూ చిన్నారి ఇంత చిన్న వయసులోనే రాష్ట్రస్థాయి వేదికపై ఇలాంటి సత్తా చాటడం నిజంగా గర్వకారణం. ఇది క్రమశిక్షణ, ధైర్యం, తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్‌ల కఠిన అభ్యాసానికి నిదర్శనం. ఇలాంటి ప్రతిభావంతుల పిల్లలు భవిష్యత్తులో తెలంగాణకు మరిన్ని క్రీడా విజయాలు తెస్తారు" అని పేర్కొన్నారు.చిన్నారిని తీర్చి దిద్దిన కోచ్‌ల కృషిని, నిరంతరం ప్రోత్సహించిన తల్లిదండ్రుల పాత్రను ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రశంసించారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. చిన్నారి సాధించిన ఈ విజయంపై క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆమె భవిష్యత్‌లో జాతీ యఅంతర్జాతీయస్థాయిలోనూ మెరవాలని ఆకాంక్షిస్తున్నారు.

## మలక్‌పేట ప్రభుత్వ అంద బాలికల పాఠశాలలో నిరంతరం అడ్మిషన్ల ప్రక్రియ

### -స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నికోలాస్


మలక్ పేట అంద బాలికల పాఠశాలను పరిశీలిస్తున్న స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నికోలాస్, డిఇఒ రోహిణి తదితరులు

**మలక్‌పేట డిసెంబర్ 1 ప్రభాతవార్త :**
మలక్‌పేట ప్రభుత్వం అంద బాలికల పాఠశాలలో నిరంతరం అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగించడానికి చర్యలు చేపట్టనున్నట్లు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నికోలాస్ పేర్కొన్నారు. అక్బర్ బాగ్ మలక్ పేట ప్రభుత్వ అంద బాలికల పాఠశాల, హాస్టల్ ను విద్యాశాఖ డైరెక్టర్ నికోలాస్, డీఈఓ రోహిణి తదితరులతో కలిసి సందర్శించి పరిశీలించారు. పాఠశాల, హాస్టల్ లోని మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలక్ పేట ప్రభుత్వ అంద బాలికల పాఠశాలలో అడ్మిషన్లు తక్కువగా ఉన్నాయని, విద్యార్థులు ఎప్పుడు అడ్మిషన్ల కోసం వచ్చిన పాఠశాలలో చేర్చుకోవడానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అటెండర్ పోస్టులను త్వరలో భర్తీ చేయనట్లు వివరించారు పాఠశాలలో డైనింగ్ హాల్ ను ఏర్పాటు చేయనునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇఒ రోహిణి, సైదాబాద్ మండల ఉప విద్యాశాఖ అధికారి సుకన్య, డిప్యూటీ ఐఒఎస్ వెంకట్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హస్ర ఫాతిమా, మలక్ పేట బదిర పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి : ఎమ్మెల్యే అహ్మద్ బలాల


అక్బర్ బాగ్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల, కార్పొరేటర్ మినాజుద్దీన్, చిత్రంలో సూగురు రమేష్, శ్రీనివాస్ బాబా తదితరులు

**మలక్ పేట, డిసెంబర్ 1, ప్రభాతవార్త:**
ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి చేస్తున్నామని మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. అక్బర్ బాగ్ డివిజన్ లోని పలు ప్రాంతాలలో డివిజన్ కార్పొరేటర్ మినాజుద్దీన్ తో కలిసి కలిసి వివిధ ప్రాంతాలలో రూ 5. 12 కోట్ల తో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే అహ్మద్ బలాల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు .త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి వివిధ శాఖల అధికారులకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించడం జరిగిందనీ వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు నాగరాజు గౌడ్, ఏఈ వెంకన్న, స్థానికులు సూగురు రమేష్, శ్రీనివాస్ బాబా పాల్గొన్నారు.

## హస్తినాపురం డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశాం

### కార్పొరేటర్ సుజాత నాయక్


కాలనీవాసులతో కార్పొరేటర్ సుజాత నాయక్.

**వనస్థలిపురం డిసెంబర్1,ప్రభాతవార్త :**
పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్ తెలిపారు డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీలో 8 లక్షలతో రూపాయలతో అర్బన్ బయోడైవర్స రీ వారి ద్వారా మంజూరు చేయబడిన నిధులతో పార్కు అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలోని పార్కుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత డివిజన్ లో కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి స్థానిక సంక్షేమ సంఘం నాయకులు వెంకట్ రెడ్డి రాజిరెడ్డి వెంకటేష్ గుప్తా చంద్రశేఖర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి అంజిరెడ్డి రామ కృష్ణారెడ్డి గోపాల్ రెడ్డి మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# రూ.కోటి 29లక్షలతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


బీరప్పగడ్డలో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 1 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ లో రూ. కోటి 29 లక్షల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, పలువురు కాలనీ సంఘం నేతలు, బిఆర్ఎస్ పార్టీ నేతలతో కలిసి ఉప్పల్ బీరప్పగడ్డ, చిలుకానగర్, బ్యాంక్ కాలనీ, రాఘవేంద్రనగర్, కళ్యాణపురి, బాలాజీ ఎన్‌క్లేవ్, సాయిరాంనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిలుకానగర్ డివిజన్‌లో దశలవారిగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. బాలాజీ ఎన్‌క్లేవ్, నార్త్ కళ్యాణపురిలో పార్కుల అభివృద్ధి, బీరప్పగడ్డలో డ్రైనేజీ పనులు, సాయిరాంనగర్ కాలనీలో బాక్స్ డ్రైన్ పనులు, బోడ్రాయి గల్లీలో సిసి రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్పొరేటర్ బన్నాల గీత మాట్లాడుతూ డివిజన్‌లో ఇప్పటి వరకు రూ.105 కోట్లతో పలు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇ వెన్నెల గౌడ్, ఎఇ రాధిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్,స్థానిక నేతలు వాకిటి బుచ్చిరెడ్డి, కోల రవికుమార్‌గౌడ్, నెర్థం భాస్కర్ గౌడ్, గుడి మధుసూధన్‌రెడ్డి, అన్న బాలకృష్ణ, కొండల్‌రెడ్డి, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, గడ్డం పాపిరెడ్డి, నవీన్‌చారి, చేర్యాల శ్రీనివాస్ పలువురు కాలనీ సంఘం నేతలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల మహాధర్నా విజయవంతం చేయాలి


కరపత్రం ఆవిష్కరిస్తున్న జర్నలిస్టులు

**హయత్ నగర్, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**
తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియుడబ్ల్యూజె) ఆధ్వర్యంలో ఈ నెల 3న హైదరాబాద్ లోని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా టియుడబ్ల్యూజే కోశాధికారి సంరెడ్డి శశిపాల్ రెడ్డి, హయత్ నగర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు శ్రీరామ్ యాదయ్య కోరారు. హయత్ నగర్ మండల కేంద్రంలోని అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిరక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. జర్నలిస్ట్ జీవితాలు గత పుష్కర కాలంలో ఏమాత్రం మెరుగుపడలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పొందిన ఆరోగ్య భీమా వంటి సౌకర్యాలు సైతం అందకుండా పోయాయన్నారు. టీఆర్ఎస్ పదేళ్ల పాలనలో హామీలన్నీ కాగితాలకే పరిమితం పరిమితమ య్యాయని, తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే బాటలో పయనిస్తుందన్నారు. జర్నలిస్టులకు అక్రిడేషన్ పాలసీని ప్రకటించి వెంటనే కొత్త కార్డులు జారీ చేయాలన్నారు. ఆరోగ్య భీమా పథకాన్ని పునరుద్ధ రించాలని, అరులైన జర్నలిస్టు లందరికి ఇల్లస్థలాలు మంజూరు చేయాలని, సంక్షోభంలో ఉన్న చిన్న మధ్య తరగతి పత్రికలను ఆదుకోవాలనన్న డిమాండ్లపై ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలోని జర్నలిస్టులు అందరూ ధర్నాలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కోశాధికారి మధు, జిల్లా కార్యవర్గ సభ్యులు దర్శనం జంగయ్య, జర్నలిస్టులు గూడెపు జగన్ గౌడ్, చెరుకు వెంకటస్వామి, రాసాల వెంకటేష్ యాదవ్, నామ ఆంజనేయులు, రాకేష్, శేఖర్ రెడ్డి, రాములు, డి శ్రీనివాస్, రమేష్, శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# ఉప్పల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలు పట్టించుకోరా..? : రాగిడి లక్ష్మారెడ్డి


ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ రాజుకు ఫిర్యాదు చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 1 ప్రభాతవార్త** : ఉప్పల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల విషయంలో అధికారులు పట్టించుకోవడం లేదని బిఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం పలువురు పార్టీ నేతలతో కలిసి ప్రజావాణిలో డిప్యూటి కమిషనర్ రాజును కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ సర్కిల్‌లో మున్సిపల్ అధికారులు పేదలపై ప్రతాపం చూపిస్తూ పెద్దలకు దాసోహం అంటున్నారని ఆరోపించారు. పేదలకు ఒక న్యాయం, పెద్దలకు మరో న్యాయం నడుస్తుందన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు కోర్టు ఆదేశాలు దిక్కరించి పనులు చేస్తున్నారని, తూతూమంత్రంగా భవనాలు సీజ్ చేసి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. అధికారులు కొందరి కనుచూపు మేరలో పనిచేస్తున్నారని, ఉప్పల్ భగాయత్‌లో నిబంధనలకు విరుద్దంగా షెడ్లు నిర్మిస్తున్నారని, మాడల్ లేఅవుట్‌ను అధ్వాన్నంగా తయారు చేశారని ఆరోపించారు. అధికారులు కోర్టు ఆదేశాలు పాటించాలని, జిహెచ్ఎంసికి ఆదాయం వచ్చే అంశాలపై దృష్టి కేంద్రకరించాలని సూచించారు. భవన యజమానుల నుంచి అధికారులు అందినంత దోచుకుంటున్నారని, అవినీతి అధికారులపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. చిన్న గదులు నిర్మించుకున్న పేదలను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని, పెద్దలను వదిలివేస్తున్నారని పేర్కొన్నారు. తాను అనేక సంఘ సేవా కార్యక్రమాలు చేపట్టానని, పేదలపై ప్రతాపం చూపిస్తే సహించేది లేదన్నారు. దీనిపై త్వరలోనే ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు సహకారం సామాజిక బాధ్యత : సబితా ఇంద్రారెడ్డి


బ్యాటరీ ట్రై సైకిళ్లను అందజేసి దివ్యాంగులను భుజం తట్టి ప్రోత్సహిస్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** దివ్యాంగులకు అందించే సహకారం కేవలం మానవతా దృక్పథమే కాదనీ సామాజిక బాధ్యత కూడా అని మాజీ మంత్రి, మహేశ్వరం శాసనసభ్యురాలు పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ ప్రాంతాలకు చెందిన పేద దివ్యాంగులకు ఊతమిచ్చే ఎలక్ట్రానిక్ ట్రై సైకిళ్ళను సబితారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీర్‌పేట్ లెనిన్‌నగర్ వీకర్ సెక్షన్‌కు చెందిన దివ్యాంగ ఎమ్మార్పీఎస్ నాయకుడు శాగంటి పుల్లయ్య, మహేశ్వరం నేదునూరు గ్రామానికి చెందిన దేవరకొండ అంజయ్య, మీర్‌పేట్ నంది హిల్స్‌కు చెందిన జూలూరు సైదులకు ఆమె ట్రై సైకిళ్ల అందజేసి భుజం తట్టి ఆత్మవిశ్వాసం నింపారు. అనంతరం వారు సబితమ్మ సమక్షంలో ట్రై సైకిళ్లను నడిపి ఆనందం సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల మానవత్వంతో పాటు సామాజిక బాధ్యతగా కూడా వ్యవహరించాలని సమాజానికి సూచించారు. వారిలో ఆత్మవిశ్వాసం నింపే విధంగా ప్రోత్సహించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు దిండు భూపేష్‌గౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు జమాల్‌పూర్ సునీతా బాలరాజ్, కో–ఆప్షన్ సభ్యుడు ఎంఎ రజాక్, బడంగ్‌పేట్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, పార్టీ నాయకులు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ సిల్వేరి సాంబశివ, రాళ్ళబండి కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ మహాధర్నా విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియుడబ్ల్యూజె) ఆధ్వర్యంలో ఈ నెల 3న హైదరాబాద్లోని రాష్ట్ర సమాచారశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి కె. శ్రీకాంత్‌రెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు ప్రవీణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కొత్తపేట బీజేఆర్ భవన్‌లో మహాధర్నా పోస్టర్ను ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీకాంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. జర్నలిస్ట్ జీవితాలు గత పుష్కర కాలంలో ఏమాత్రం మెరుగుపడలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పొందిన ఆరోగ్య భీమా వంటి సౌకర్యాలు సైతం అందకుండా పోయాయన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఒకే విధానాన్ని అవలంబిస్తున్నాయన్నారు. అక్రెడేషన్ కొత్త కార్డులు జారీ, ఆరోగ్య భీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలన్నారు. జర్నలిస్టులందరికి ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని తెలిపారు. జర్నలిస్టులు అందరూ ధర్నాలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, నరసింహ మొగిలి, శ్యామ్‌ప్రసాద్, శేఖర్, దశరథ, శ్రీనివాస్, మల్లేష్‌గౌడ్, గణేష్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు, మహేష్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

## చిలుకేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలి

**ఉప్పల్, డిసెంబరు 1 ప్రభాతవార్త :** చిలుకానగర్‌లోని హరిహర క్షేత్రం శ్రీ చిలుకేశ్వర అంజనేయ స్వామి దేవాలయం కమిటి సర్వ సభ్య సమావేశం ఆలయ కమిటి అధ్యక్షులు దాసరి కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన పునః నిర్మాణం, విరాళాల సేకరణ, కమిటి సభ్యుల సూచనలు, సలహాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షుడు దాసరి కృష్ణ మాట్లాడుతూ ఆలయం అభివృద్దికి భక్తుల నుంచి విస్తృతంగా విరాళాలు సేకరించాలని కమిటి సభ్యులు నిర్ణయించినట్లు తెలిపారు. ఆలయ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు తమ వంతు పాలు పంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక అధ్య క్షులు బూర్గుల రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గోనె శ్రీకాంత్, కోశాధికారి అమృత్ రావు, ఉపాధ్యక్షులు రాంచర్ల బాలరామ్, అశోక్ చారి, మాస శేఖర్, సలహాదారులు గోనె అంజయ్య, కార్యదర్శులు రామచందర్, గూడ శ్రీశైలం, కావాలి నర్సింహ్మా, గుర్రాల మల్లేష్, వెద్యుల వీరారెడ్డి, పి.శివ కుమార్ ప్రచార కార్యదర్శులు మడిపడిగే శ్రీనివాస్, పోలోజు శ్రీనివాస్ చారి, ఇంద్రరాల రమేష్, గోనె మల్లేష్, రాంరెడ్డి పాల్గొన్నారు.

## పిఎంఆర్ గార్డెన్స్‌లో పదునెట్టాంబడి మహాపడి పూజ

**సరూర్‌నగర్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:**
మహేశ్వరం నియోజకవర్గంలోని పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్స్ లో అయ్యప్ప స్వామి పదునెట్టాంబడి అయ్యప్ప స్వామి మహ పడి పూజ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరై పడి పూజ జరిగిన అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫంక్షన్ హాల్ అధినేత, బడంగ్‌పేట్ సీనియర్ మాజీ ప్రజాప్రతినిధి పెద్దబావి ఆనంద్‌రెడ్డి, అల్మాస్‌గూడ మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి, కర్రె బల్వంత్‌లతో పాటు పలువురు గురు స్వాములు, మాలధారణ స్వాములు, అయ్యప్ప భక్తులు, పూజా నిర్వాహకులు పాల్గొన్నారు.

## 7న దిల్‌షుక్‌నగర్ ఆర్టీసీ డిపో నుంచి పుణ్యక్షేత్రాలకు బస్సు సౌకర్యం

### : డిపో మేనేజర్ సమత

**మలక్ పేట , డిసెంబర్ 1, ప్రభాతవార్త:**
దిల్ షుక్ నగర్ ఆర్టీసీ డిపో నుంచి డిసెంబర్ 7వ తేదీన విహారయాత్ర, పుణ్యక్షేత్రాలు సందర్శన కోసం బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని దిల్ షుక్ నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సమత ఓ ప్రకటనలో తెలిపారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుణ్యక్షేత్రాలకు, విహారయాత్రలకు దిల్ షుక్ నగర్ సిటీ డిపో నుండి మరో విహారయాత్ర ట్రిప్పు వెళ్లుటకు బస్సు ను ఏర్పాటు ను చేయడం జరిగిందని ,బుకింగ్ లను కూడా మొదలు పెట్టడం జరిగిందని తెలిపారు. డిసెంబర్ 7వ తేదీ తేదీ ఆదివారం ఉదయం 5 గంటలకు దిల్ షుక్ నగర్ సిటీ డిపో నుండి ఒక్కరోజులో భద్రకాళి దేవాలయం, వేయి స్తంభాల గుడి, రామప్ప దేవాలయం, లక్నవరం లేక్ తదితర ప్రాంతాలనుసందర్శించడం కోసం బస్సు ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.టికెట్ చార్జీలు చార్జీలు పెద్దలకు రూ950/పిల్లలకు రూ 600/ మాత్రమేనని చెప్పారు.40 మంది కెపాసిటీ గల మెట్రో డీలక్స్ బస్సు ను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.ఈ అవకాశమును విహారయాత్రకు వెళ్లుటకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆసక్తి గల వారు దిల్ షుక్ నగర్ సిటీ డిపో యొక్క ఫోన్ నెంబర్ లలో బుచ్చిరెడ్డి 7989928321, పి. మోహన్ రావు 9032059920లలో సంప్రదించాలని పేర్కొన్నారు. బుకింగ్ లు ప్రారంభం అయ్యాయని, కావున బుకింగ్ చేసుకోవాలని కోరారు.

## మైత్రి కుటీర్ నూతన కార్యవర్గం ఎన్నిక

**హయత్ నగర్, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**
పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ లక్ష్మారెడ్డి పాలెం లోని మైత్రి కుటీర్ గేటెడ్ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షిక ఎన్నికలు నవంబర్ 30 ఆదివారం రోజున కమ్యూనిటీ హాల్లో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కమిటీ నూతన అధ్యక్షులుగా ఎడ్ల నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుద్దాల ఎల్లయ్య, గౌరవాధ్యక్షుడిగామేకమహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుద్దాల ఎల్లయ్య, కోశాధికారిగా విన్నుకోట రామ్మోహన్ రావు, కార్యవర్గ సభ్యులుగా ఎం. రవీందర్ రెడ్డి, పవన్ నాయక్, సూర్యనారాయణరాజు, నరసింహ రావు, రంగారెడ్డి, ఉప్పల వెంకటేశ్వర్లు, నాగ మురళి కృష్ణ, నల్లాన నిర్మల్ కుమార్, వీర ప్రసాద్, వెంబడి వెంకటేశ్వర రావు, రవీందర్, వెంకటేశ్వర్లు గౌడ్ ఎన్నికయ్యారు. రెండేళ్ల పాటు కార్యవర్గం కొనసాగనుంది. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ... కార్యవర్గం, కాలనీవాసుల సహకారంతో పారదర్శకంగా కాలనీ సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు.

## డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి : లచ్చిరెడ్డి


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం డిసెంబర్ 1, ప్రభాతవార్త**
బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ప్రారంభించిన సీ.సీ రోడ్ల పనులను బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కాలనీ వాసులతో కలిసి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో త్వరలోనే ఒకటొకటిగా ప్రతి అభివృద్ధి మరియు సమస్యల పరిష్కారానికి కృషి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.కార్యక్రమంలో సాయిరాం కాలనీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఆఫీసర్స్ కాలనీ అధ్యక్షులు బాలాజీ, శ్రీపురం కాలనీ ఫేస్ 2 అధ్యక్షులు ముత్యంరావు మరియు పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్ రావు,ప్రధాన కార్యదర్శి గంగం ప్రేమ్ నాథ్,విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు జయపాల్ రెడ్డి, ఓబిసి మోర్చా అధ్యక్షులు మహేష్ గౌడ్, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్, నాయకులు సుధీర్, హరికృష్ణ, మధుసూదన్ రెడ్డి,గిరి, శివకుమార్, సాయిరాం మరియు తదితరులు ఉన్నారు.

## మాజీ మంత్రి కెటిఆర్‌ను కలిసిన సామ సుందర్‌రెడ్డి


మాజీ మంత్రి కెటిఆర్‌కు పూల మొక్క అందజేస్తున్న సామ సుందర్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 1 ప్రభాతవార్త:** మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ను సోమవారం యాకుత్‌పుర నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంఛార్జి సామ సుందర్‌రెడ్డి, ఐఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్న సుందర్‌రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిసారు.కార్యక్రమంలో యాకుత్‌పుర నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## విధి నిర్వాహణలో అంకిత భావంతో పని చేసిన వెంకటయ్య


వెంకటయ్య దంపతులను సన్మానిస్తున్న ఈఓ లావణ్య, చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, ధర్మకర్తలు, సిబ్బంది

**సైదాబాద్, డిసెంబరు 1 ప్రభాతవార్త:** కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో సుదీర్ఘ కాలం పాటు జూనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వర్తించి ఇటీవలే కార్యనిర్వాహణాధికారిగా పదోన్నతి పొందిన మన్నె వెంకటయ్య గత నెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా సోమవారం దేవాలయంలో మన్నె వెంకటయ్య అన్నపూర్ణ దంపతులకు ఆత్మీయ సన్మానం చేశారు. వెంకటయ్య దంపతులను ఆలయ వేద పండితులు, అర్చకులు ఆశీర్వదించి స్వామి వారి ప్రసాదం అందజేశారు. దేవాలయ అభివృద్ధికి దాతల సహకారం పొందడంలో వెంకటయ్య చూపిన చొరవను, ఉద్యోగ పరంగా తమకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా దేవాలయ ఉద్యోగులు, అర్చకులు, సిబ్బంది గుర్తు చేసుకున్నారు. ఉద్యోగ నిర్వాహణలో అంకిత భావాన్ని కనబరిచిన వెంకటయ్య సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వాహణాధికారి యన్.లావణ్య, చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణ రెడ్డి, ఎక్స్ అఫీషియో సభ్యుడు ఎస్.అంబాప్రసాద్, ధర్మకర్తలతో పాటు కార్య నిర్వాహణాధికారులు డి.ప్రవీణ్ కుమార్, పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి మహా పడిపూజ


అయ్యప్ప స్వామి పూజ నిర్వహిస్తున్న తోట మహేష్‌యాదవ్

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:**
హరిహర సుత అయ్యప్పస్వామి మహ పడిపూజ కార్యక్రమం అయ్యప్పస్వామి భక్తుల శరణుఘోష మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చైతన్యపురి డివిజన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆయన నివాసం వద్ద సోమవారం అయ్యప్పస్వామి మహ పడిపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వామిని వేడుకొంటూ అయ్యప్పస్వామి భక్తులు భజనలు గీతాలాపనలు చేయడంతో ఆ ప్రాంతం ఆధ్యాంతం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్, తోట కృష్ణయాదవ్, తోట మహేందర్‌యాదవ్, సుధాకర్, సురేందర్ పాల్గొన్నారు.

## ప్రజాసేవే పరమావధిగా పనిచేసిన సుభాష్‌రెడ్డి


సుభాష్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్లు, నాయకులు

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:**
ప్రజాసేవే పరమావధిగా నిరంతరం పనిచేసిన సుభాష్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని కార్పొరేటర్లు బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, నాయకోటి పవన్‌కుమార్, రంగ నరసింహ గుప్తాలు పేర్కొన్నారు. గడ్డిఅన్నారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బద్దం సుభాష్‌రెడ్డి 6వ వర్ధంతి బీజేపీ గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షులు దాసరి జయప్రకాష్ ఆధ్వర్యంలో పిఅండ్‌టి కాలనీ చౌరస్తా వద్ద సుభాష్‌రెడ్డి చిత్రపటానికి కార్పొరేటర్లు రంగా నర్సింహగుప్తా, నాయికోటి పవన్, బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు దాసరి మల్లేశం, చిలకూరి రామ్‌రెడ్డి, నాయకులు కలిసి పూలమాలలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పారిశుభ్ర, ఎంటామాలజీ సిబ్బందికి చలి స్వెట్టర్లు, గ్లౌజులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రజల కోసమే పని చేస్తూ, పార్టీ బలోపేతం, కార్యకర్తల అభివృద్ధి, మున్సిపాలిటీ అభివృద్ధికి సుభాష్‌రెడ్డి చేసిన కృషి నేటికీ మాకు స్ఫూర్తిగా నిలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఆనంద్‌కుమార్, ఏనుగు శ్రీధర్ రెడ్డి, నర్సింహ, శ్రీనివాస్, చిలకూరి జనార్దన్‌రెడ్డి, సుందర్ నారాయణ, సుబ్బారెడ్డి, మురళి, నగేష్‌నాయక్, సుజాత, శ్రీలక్ష్మి, రాజేశ్వరి, ధనరాజ్, సిరి, శిరీష, సందీప్, సతీష్, హనుమంత్‌రెడ్డి, కృష్ణ, శ్రీనివాస్, అనిల్, లోకేష్, మహేష్, శ్రీకాంత్ నాయుడు, శరత్, వంశీయాదవ్, సిద్ధు, రఘునందన్‌జోషి, టీంకు, శశాంక్, హరీష్, నాని తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ జిల్లా యోగా పోటీల్లో సత్తా చాటిన లార్డ్స్ విద్యార్థులు


యోగా పోటీల్లో ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచిన లార్డ్స్ విద్యార్థులు

**సరూర్‌నగర్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** 12వ తెలంగాణ అంతర్ జిల్లా యోగాసన ఛాంపియన్ పోటీల్లో బడంగ్‌పేట్ లార్డ్స్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటి బహుమతులు సాధించారు. హైదరాబాద్ గత నెల 29, 30 తేదీల్లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు సంబంధించిన విద్యార్థులకు నిర్వహించిన 2025–26 యోగా పోటీల్లో లార్డ్స్ పాఠశాలకు చెందిన ఆర్.వెంకట కార్తికేయ ప్రథమ బహుమతిని, ఆర్. వెంకట గణపతి తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా లార్డ్స్ విద్యా సంస్థల ఛైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ ఛైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ సిద్దాల శ్రీలత, ప్రిన్సిపాల్ రామిడి సంతోష్, ఇంఛార్జి రేఖాసాగర్‌లు విజేత విద్యార్థులను అభినందించారు.

## శస్త్ర చికిత్స అవసరమైన పేద రోగికి సబితారెడ్డి అండ


రూ.2 లక్షల ఎల్ఓసిని అందజేస్తున్న మాజీ మంత్రి సబితారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** అనారోగ్య పరిస్థితుల కారణంగా తప్పనిసరిగా శస్త్ర చికిత్స అవసరమైన ఓ పేద రోగికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అండగా నిలిచారు. వ్యాధి నిర్ధారణ జరిగి ఆపరేషన్ నిమ్స్ ఆసుపత్రిలో చేరి ఆపరేషన్ చేయించుకోవాల్సి ఉన్న మీర్‌పేట్ నందిహిల్స్ కాలనీకి చెందిన గునిగంటి ధవలయ్యగౌడ్ స్థానిక బిఆర్ఎస్ నేతతో కలిసి ఇటీవల సబితారెడ్డిని ఆశ్రయించారు. ఈ మేరకు ఆమె కేవలం రెండు రోజుల్లోనే సిఎం సహాయ నిధి నుండి బాధితునికి రూ.2 లక్షల ఎల్ఓసిని మంజూరు చేయించి సంబంధిత పత్రాన్ని అందజేశారు. ఈ నేపథ్యంలో చెక్కును తీసుకున్న గౌడ్ సబితారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## బిసిల ద్రోహి బిజెపి : కోట్ల శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసి వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్

**సైదాబాద్, డిసెంబరు 1 ప్రభాతవార్త:**
పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో రాజ్యాంగ సవరణ ద్వారా బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్దత కల్పించేలా రాష్ట్ర బిజెపి నాయకులు కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తేవాలని హైద్రాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బిసిల గురించి మొసలి కన్నీరు కారుస్తున్న రాష్ట్ర బిజెపి నాయకులకు నిజంగా బిసిలపై ప్రేమ ఉంటే 42 శాతం బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూలులో చేర్చేలా కేంద్రాన్ని ఒప్పించాలని, లేదంటే తమ పదవులకు రాజీనామా చేయాలని కోట్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బిజెపిలో బిసిలకు తగిన ప్రాతినిధ్యం దక్కడం లేదని, బిజెపి జిల్లా అధ్యక్షుల ఎంపికలో కూడా బిసిలకు అన్యాయం చేశారని, బిజెపి బిసిల ద్రోహిగా మారిపోయిందని కోట్ల శ్రీనివాస్ విమర్శించారు.